# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# ౬౬ వ భాగం

### అజామీళోపాఖ్యానం – 1

### పాప పుణ్యాలు

అజామీళోపాఖ్యానం భాగవతం ఆరవ స్కంధం లోనిది. దీన్ని తెలుగించిన వారు పోతనకి వల్లమాలిన భక్తుడైన ఏర్చూరి సింగయ గారు. భాగవతంలో 5, 6, 11, 12 స్కంధాలు పోతన రాయలేదనీ వాటిని తన శిష్యులైన నారయ సింగయ లకి ఇచ్చారనీ ఓ వాదన ఉంది. దీని సంగతి ఒకసారి చూద్దాం. రాముడు ధ్యానంలో కనిపించి పోతనని 'నువ్వూ, నీ శిష్యులూ కలిసి భాగవతం తెనిగించండి' అని చెప్పలేదు కానీ 'నువ్వు భాగవతాన్ని తెనిగిస్తే భవబంధాలు తెగుతాయి' అని చెప్పాడు కదా, అందువల్ల మొత్తం భాగవతం అంతా పోతనే తెనిగించాడనీ, అవి కొంత మేరకి ధ్వంసం అవడం వల్ల ఆయన శిష్యులు పాడైనవాటిని పూర్తి చేసారనీ అని కరుణశ్రీ గారంటారు. అయితే సరిగ్గా 5, 6 వరసలోనూ 11, 12 మరో వరసలోనూ పాడవడానికి ఆస్కారం ఏమిటి? దానికి ఆయన ఇచ్చే వివరణ కూడా బాగుంటుంది. మొత్తం భాగవతం అంతా తెనిగించాక అవి వరుసలో ఒకటి నుంచి ఆరు దాకా ఒక బొత్తిలో, ఏడునుంచి పన్నెండు దాకా మరో బొత్తిలో పెట్టి ఉండొచ్చు పోతన. అలా కింద ఉన్న 5, 6, 11, 12 స్కంధాలు చెదల వల్ల పాడయ్యేయి. అందువల్ల వాటిని తిరిగి శిష్యులు తిరిగి రాసారు మొత్తం పునరుద్ధరించడానికి.

మరో కథ ఏమిటంటే ఆ రోజుల్లో ఉన్న రాజు – సర్వజ్ఞ సింగమనీడు, ఈ గ్రంథాన్ని తనకి అంకితం ఇవ్వనందుకు మొత్తం భాగవతం అంతా భూమిలో పాతిపెట్టించాడనీ, అందువల్ల అది కొంతమేర ధ్వంసం అయిందనీను. కరుణశ్రీగారు అనడం ప్రకారం ఆ సర్వజ్ఞ సింగమనీడు మరీ అంత దుర్మార్గుడు కాదు, ఆ రోజుల్లోనే చాలామంది కవులని చేరదీసినవాడు. భాగవతాన్ని తనకి అంకితం ఇవ్వకపోయినా రాముడికి ఇచ్చినందుకు కుళ్ళుకుని ఏడిచే అంతటి నీచుడూ కాదు. అందువల్ల ఇటువంటి గ్రంథాన్ని భూమిలో పాతిపెట్టే పని ఆయన చేయడు. అదీకాక ఈ గ్రంథం తనకి అంకితం ఇవ్వలేదని కోపం అయితే దీన్ని కాల్చిపారేయవచ్చు కానీ భూమిలో పాతిపెట్టించడం దేనికీ? ఇవన్నీ చూస్తే మనకి తెలిసేది ఏమిటంటే ఇంట్లోనే చెదలవల్ల ఈ గ్రంథం కొంతమేర శిధిలమైంది. దాన్ని శిష్యులు కష్టపడి తిరిగి రాసారు. అలా కొన్ని నారయ చేతిలో కొన్ని సింగయ చేతిలో పడ్డాయి.

సింగయ కూడా ఈ స్కంథం మొదలుపెడుతూ తన వంశం గురించీ, తనకి కలిగిన సరస్వతీ కటాక్షం గురించీ, పోతన మీద భక్తి గురించీ, తన తల్లితండ్రుల గురించీ రాస్తూ ఆరంభానికి ముందు తనకి నారాయణుడిమీద మనసులో మెదిలిన అద్భుతమైన శ్లోకాన్ని చెప్పుకున్నారు.

శ్లో. హంసాయ సత్త్వనిలయాయ సదాశ్రయాయ నారాయణాయ నిఖిలాయ నిరాశ్రయాయ
సత్సంగ్రహాయ సగుణాయ సదీశ్వరాయ సంపూర్ణ పుణ్యపతయే హరయే నమస్తే. [6-20]

పరమహంస స్వరూపుడూ, సత్వగుణానికి, మంచివారికి ఆశ్రయమైనటివంటివాడైన నారాయణునికి, మంచిని గ్రహించేవాడికీ (సత్సంగ్రహాయ), పుణ్యలోకాలకి నాయకుడైనవాడికీ నమస్కారం.

కథ మొదలుపెట్టేముందు పరీక్షిత్తు అడుగుతున్నాడు శుక మహర్షిని.

సీ. షడ్గుణైశ్వర్య శాశ్వతమూర్తి వయినట్టి;
మునినాథ! దయతోడ ముక్తిపదము
మున్నుగా నేమార్గమున వినిపించితి;
వారయ నపవర్గ భూరిమహిమఁ
గ్రమయోగసంభవ బ్రహ్మంబుతోఁగూడ;
ననుబొంద నగు నని వినుతి కెక్క
మఱియు సత్త్వరజ స్తమః ప్రభావంబులఁ;
గడిఁదియై యున్నట్టి కర్మచయము [6-39]

తే. నప్పటప్పటి కడఁగని యట్టి ప్రకృతి
గలుగు పురుషుని భోగార్థఘటన దేహ
కారణా రంభ రూపమార్గంబు మొదలు
మాటిమాటికి నన్నియుఁ దేటపడఁగ [6-39.1]

భాగవతం వినిపిస్తూ ముక్తి మార్గం ఏమిటో చెప్పావు, యోగులు ఏ నివృత్తి మార్గం అవలంబించి బ్రహ్మాన్ని చేరుకుంటారో కూడా చెప్పావు. అయితే భోగాలని అనుభవిస్తూ ఒక జీవితం తర్వాత మరో జీవితం లోకి తోయబడుతూ ప్రవృత్తి మార్గం అనుసరించేవారు అదే క్రమంలో మాటిమాటికి పుడుతూ ఛస్తూ ఉన్నారు కదా?

ఈ సీస పద్యంలో శుకమహర్షిని పరీక్షిత్తు ఏమంటున్నాడో గమనించారా? “షడ్గుణైశ్వర్య శాశ్వతమూర్తి వయినట్టి మునినాథ.” దీనికో చిన్న వివరణ. శుకమహర్షి వ్యాసుడికి కొడుకు, శిష్యుడూ కూడా. బాగా చిన్నతనం నుంచీ సంసారం అంటే విరక్తి పుట్టి తపస్సుతో బ్రహ్మర్షి అయినవాడు. ఒకసారి ఎవరో స్త్రీలు చెరువులో స్నానం చేస్తుంటే వ్యాసుడు అటువైపు రావడం చూసి వెంఠనే వాళ్ళ బట్టలు కట్టుకోవడం ఒళ్ళు దాచుకోవడం జరిగిందిట. ఆ తర్వాత అదే దారిలో శుకమహర్షి వెళ్ళాడు. అయితే ఈ స్త్రీలు ఆయన్ని అసలు పట్టించుకోకుండా స్నానాలు సాగించడం వ్యాసుడికి అమితాశ్చర్యం కలిగించింది. వెళ్ళి వాళ్లనే అడిగాడుట, “ఇదేమిటి, వాడు నా కొడుకు, నేను నేర్పితే నా దగ్గిర శిష్యరికం చేసి బ్రహ్మర్షి అయ్యేడు. నా కన్నా వయసులో బాగా చిన్నవాడై, యవ్వనంలో ఉన్న వాణ్ణి చూసీ చూడనట్టు వదిలేసి, నేను వస్తే బట్టలు సర్దుకున్నారేం?” వాళ్ల సమాధానం ఏమిటంటే, “అయ్యా మీరు పెళ్ళి చేసుకుని బ్రహ్మర్షి అయ్యారు, అందువల్ల ఏదో పాత వాసనల వల్ల మీకు మమ్మల్ని చూస్తే ఏమౌతుందో అనే, మేము అలా చేసాం. ఇంక మీ అబ్బాయికి ఇటువంటి వాసనలు లేవు ఆయన సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపుడు. మమ్మల్ని ఎలా చూసినా ఆయనకి వికారాలు కలగవు. అందువల్లే అలా ఆయన్ని వదిలేసాం.” అదే “షడ్గుణైశ్వర్య శాశ్వతమూర్తి” అంటే. ఐశ్వర్యం, ధైర్యం, కీర్తి, తేజస్సు, జ్ఞానం, వైరాగ్యం అనే ఆరు గుణాలనీ పుణికిపుచ్చుకున్నవాడు ఆయన. ఎప్పుడు? ఏదో వయసు వచ్చాక కాదు, చిన్నప్పుడే వళ్ళు స్వాధీనంలో ఉండగానే ఈ సంసారం వల్ల భాధలే తప్ప సంతోషం లేదని తెలుసుకుని దాన్ని వదులుకున్నాడు. ఇక్కడ సంసారం అంటే పెళ్ళీ పిల్లలూ కాదని, జనన మరణ చక్రం అనీ గమనించాలి. స్వామి వివేకానంద,

రామకృష్ణులూ, రమణ మహర్షి, బుద్ధుడూ అలా ఏ బ్రహ్మర్షి కథ చూసినా దాదాపు ఇదే విధంగా వాళ్ళు చిన్నవయసులోనే సన్యసించడం గమనించవచ్చు.

దీన్నే కంచెర్ల గోపన్న కూడా చెప్తున్నాడు చూడండి.

ఉ. ముప్పున గాలకింకరులు ముంగిట నిల్చినవేళ, రోగముల్
గొప్పరమైనచో గఫము కుత్తుకనిండినవేళ, బాంధవుల్
గప్పినవేళ మీ స్మరణ గల్గునో గల్గదో, నాటి కిప్పుడే
తప్పక చేతు మీ భజన దాశరథీ కరుణాపయోనిధీ

ఎప్పుడో యమకింకరులు వచ్చినప్పుడు, వళ్ళు కుళ్ళిపోయి రోగాలు వచ్చాక గొంతుకలో శ్లేష్మం నిండిపోయి మాటరానప్పుడు, చుట్టూరా బంధువులూ ఉన్నప్పుడు నీ స్మరణ కలుగుతుందో లేదో కరుణా సముద్రుడవైన రామా, ఇప్పుడే బలసత్వాలు ఉండగానే నీ నామ భజన చేస్తాను.

వ. మఱియు ననేక పాపలక్షణంబులగు నానావిధ నరకంబులును వాని కాద్యంతంబులును, స్వాయంభువ సంబంధి యగు మన్వంతరంబును, ప్రియవ్రతోత్తానపాదుల వంశంబును, దచ్చరిత్రంబును, ద్వీప వర్ష సముద్రాద్రి నద్యుద్యానవనస్పతులును, భూమండల సంస్థాపనంబును, వాని పరిమాణంబును, జ్యోతిశ్చక్రచలన ప్రకారంబును, విభుండయిన పరమేశ్వరుం డెవ్విధంబున నిర్మించె నా విధంబంతయు నెఱింగించినాడవు; ఇప్పుడు. [6-40]

పరీక్షిత్తు ఇంకా అడుగుతున్నాడు, “పాపాలు అనేకం ఎటువంటి నరకాలనిస్తాయో, మన్వంతరాల గురించీ, అందులో పుట్టిన వంశాల గురించీ, భూమండలం, ధృవ నక్షత్రంతో ఉండే జ్యోతిశ్చక్రం అది ఎలా నడుస్తుంది, ఇదంతా పరమేశ్వరుడు ఎలా నిర్మించాడు, ఎలా ఆడిస్తాడనేది పూర్తిగా చెప్పావు.”

ఆ. కడిఁది వేదనలకుఁ గారణంబై యుండు
గుఱుతులేని నరక కూపరాశి
పాలుగాక నరుఁడు బ్రతికెడు మార్గంబు
పరమపుణ్య! తెలియఁ బలుకవయ్య! [6-41]

“ఇప్పుడు మరి నా ప్రశ్న ఏమిటంటే, అనేక జన్మలు ఎత్తుతూ ప్రతీసారి బాధలకి కారణం అవుతూ అనేకానేక నరకాల్లో పడుతూ బతకడం కంటే ఆ నరకాల్లో పడకుండా బతికే అవకాశం అసలు ఏదైనా ఉందా?” అది చెప్పు. పరీక్షిత్తు ఎంత మంచి ప్రశ్న వేసాడో గమనించండి. దీనికి శుక మహర్షి ఏమంటున్నాడంటే,

క. కట్టా! త్రికరణ మెఱుఁగక
పుట్టిన దురితముల నపుడ పొలియింపని యా
కట్టఁడి దేహం బుడిగినఁ

గొట్టాడును బిట్టు నరకకూపంబులలోన్. [6-43]

త్రికరణాలతో – మనస్సు, వాక్కు, శరీరం, చేసే పాపాలకి నరకం అనుభవించాలి. అయితే ఈ పాపాలని ఎప్పటికప్పుడు పోగొట్టుకోకపోతే అలా నరకం చూడాల్సి వస్తుంది. మరి అవి పోగొట్టుకోవడం ఎలా?

ఉ. కావునఁ గాలకింకర వికారము గానకమున్న మృత్యు దు
ర్భావనఁ జిత్తమున్ వెడఁగుపాటును జెందకమున్న మేనిలో
జీవము వెల్గుచుండఁ దన చెల్వము దప్పకమున్న పన్నుగాఁ
బావనచిత్తుఁడై యఘముఁ బాయు తెఱం గొనరింపఁ గాఁదగున్. [6-44]

యమకింకరులు రాకముందే, జవసత్వాలు ఉండగానే, మనసుని పావనం చేసుకోవాలి. ఎందుకిదంతా? ఎందుకంటే జీవితంలో ఏది జరిగినా జరగకపోయినా పుట్టడం, చావడం అనేవి ఎవరికీ తప్పవు కనక. ఈ పుట్టడం చావడం మనమూలానే, మనం చేసే కర్మలమూలానే అని తెలిసి ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

ఈ కర్మలు ఎటువంటివంటే, అవి ఎన్ని జన్మలైనా మనకూడా వస్తాయిట, ఏది వచ్చినా రాకపోయినా. దాని గురించి ఈ మహాభారతం శ్లోకంలో చూడవచ్చు.

యథా ధేను సహస్రేషు, వత్సో విందతి మాతరం,
ఏవం/తథా పూర్వకృతం కర్మా కర్తారమనుగచ్ఛతి

వేలకొద్దీ ఆవులున్న మందలో కూడా దూడ తన తల్లిని అతి సులభంగా సరిగ్గా గుర్తించగలిగినట్టే, ఎన్ని వేల జన్మలెత్తినా మనం చేసుకున్న కర్మ మన కూడా తప్పకుండా వెన్నంటి వస్తూనే ఉంటుంది. అందుకే వాటిని ఎప్పటికప్పుడు వదిలించుకుంటూ ఉండాలి.

క. కాలం బెడగని పాపము
మూలముఁ జెఱుపంగవలయు మును రోగములం
దేలిన దోషము నెఱుఁగుచు
వాలాయము దాని నడఁచు వైద్యుని భంగిన్. [6-45]

వైద్యుడు రోగానికి కారణం కనిపెట్టి మందు ఇచ్చినట్టే, మనం చేసిన పాపాలకి కారణం ఇదీ అని తెలుసుకుని వాటిని అధిగమించాలి ఎప్పటికప్పుడు, ఆలస్యం చేయకుండా.

సీ. అనవుడు నాతని కనియె భూకాంతుండు;
కనుకలి వినుకలి గలిగినట్టి
పాపము దనకు నొప్పని దని కని చాలఁ;

బరితప్తుఁడయ్యుఁ గ్రమ్మఱ నొనర్చు
మూఢాత్మునకు దోషమోచనం బెయ్యది;
యారయ నెఱిఁగింపు మదియుఁగాక
కలుష మొక్కొకచోటఁ గావించు నొకచోటఁ;
గావింపకుండుఁ దత్కర్మమెఱిగి [6-46]

ఆ. యిట్టి జనుఁడు పుణ్య మేరీతిఁ జేసిన
నది ఫలింపనేర దని తలంతు
సలిలమందు మేని మలినంబుఁ బోకుండ
గజము గ్రుంకుబెట్టు గతియుఁ బోలె. [6-46.1]

ఇలా శుకమహర్షి అనేసరికి పరీక్షిత్తు మళ్ళీ అడుగుతున్నాడు, "పాపం తనకి మంచిది కాదని తెలుస్తుంది ఒకప్పటికి. దానికి పశ్చాత్తాపం కలిగితే మంచిదే. అది కలిగినా కొన్ని పరిస్థితులవల్లా, ఒకప్పుడు మరో కారణం వల్లా మళ్ళీ అవే పాపాలు చేయడానికి ఆస్కారం ఉంది మానవుడికి. కొన్నిచోట్ల చేసిన పాపాలు పోగొట్టుకోవడానికి ఏదో పుణ్యం చేయడం కుదరవచ్చు. కానీ దానివల్ల ఏమీ ప్రయోజనం ఉండదని నేను అనుకుంటున్నాను (యిట్టి జనుఁడు పుణ్య మేరీతిఁ జేసిననది ఫలింపనేర దని తలంతు). ఎందుకంటే ఏనుగుని నీళ్ళలోకి స్నానానికి తీసుకెళ్తే అది పూర్తిగా స్నానం చేసినా బయటకి వచ్చాక కూడా తన మీదకి తొండంతో మట్టి జల్లుకుంటుంది. మరి ఇటువంటి మూఢులకి – అంటే మనలాంటి వారికి, ఏమిటి తరుణోపాయం? అసలు ఏదైనా దారి ఉందా?"

మన పురాణాల్లో కానీ, ఏ మతానికి సంబంధించిన గ్రంధాలలో కానీ 'నీకు నరకమే, వేరే గతి లేదుగాక లేదు' అని ఎప్పుడూ ఉండదు గమనిస్తే. ఎందుకంటే, మానవ జీవితం ఇటువంటిది, ఇలాగే ప్రతీ ఒక్కరికీ కష్టాలు దాపురిస్తాయి; వాటిని పోగొట్టుకోవడానికో తట్టుకోవడానికో ప్రతీవారికీ ఏదో ఒక సమయంలో 'ఆ పై ఉన్నవాడు,' 'భగవంతుడు' లేకపోతే 'ఏదో తెలియని శక్తి' గుర్తుకొస్తుంది. ఆ శక్తి ఎటువంటిది, దాన్ని చేరుకోవడం ఎలా అనేవి తర్వాత వచ్చే ఆలోచనలు. ఈ వైరాగ్యం, ముముక్షత్వం అనేవి ఒకసారి తెలిసివచ్చాక, మనకి తెలిసిన భౌతిక, శారీరక, మానసిక రోగాలకి ఏదో చికిత్స ఉండాలి, ఆ చికిత్స చేసే వైద్యుడు – భవరోగనివారిణి, ఆయన ఏదైనా చేయగలడు అనేది మనసులోకి రాగానే నమ్మకం ఒకటి బయల్దేరుతుంది. అప్పుడు మనం చేసే పాపాలని మోసుకెళ్ళక్కర్లేదనీ వాటికి ఇక్కడే ఏదో ప్రాయశ్చిత్తం ఉందనీ మనకి అవగతం అవుతుంది. ఆ పాప ప్రక్షాళన ఎలా చేసుకోవాలి ఇప్పుడే ఈ జీవితంలోనే? పాపం చేసాక, మరో పుణ్యం చేస్తే ఈ ఋణ సంబంధమైన పాపం, ఆ ధనసంబంధమైన పుణ్యంతో కడిగేసుకోవచ్చుకదా, సులభంగా? అదే పరీక్షిత్తు అడుగుతూ, అలా కుదరదేమో, ఏనుగు స్నానం చేసాక కూడా బురద జల్లుకుంటూ ఉంటుంది కదా అనే దానితో పోల్చి సందేహం వెలిబుచ్చుతున్నాడు.

పరీక్షిత్తు అడిగిన ఈ సందేహానికి శుకమహర్షి ఏమి సమాధానం చెప్తాడో వచ్చే వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS